క్లుప్తంగా

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



బొప్పడాం జంక్షన్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: నేరాల నియంత్రణకు మండల వ్యాప్తంగా వివిధ ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై బి. గణేష్ తెలిపారు. మండలంలోని బొప్పడాం, పారసాం జంక్షన్లలో వివిధ షాపుల యజమానుల భాగస్వామ్యంతో శుక్రవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్, ఇతర క్రైమ్ కేసుల ఛేదనలో కెమెరాలు ఎంతగానో సహకరిస్తాయన్నారు. మండలంలోని అన్ని ప్రధాన జంక్షన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ సావిత్రి

డెంకాడ: పర్యావరణ హితమైన సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించి.. సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకునేలా చైతన్య పరచాలని వెలుగు ఏపీడీ సావిత్రి అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో పీఎం సూర్యఘర్ స్కీమ్‌పై మండల సమాఖ్య ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోలార్ యూనిట్‌ను మంజూరుకు కావాల్సిన విధివిధానాలపై ప్రజలకు వివరించాలన్నారు. బ్యాంక్ రుణం, దానిని చెల్లించే పద్ధతిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏసీ రాజ్‌కుమార్, జేడీఎం మార్టిన్, ఏపీఎం శ్రీనివాస్, సోలార్ సంస్థ మేనేజర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు మలేరియా



నెల్లిమర్ల సాంఘిక సంక్షేమ గురుకులం

నెల్లిమర్ల: పట్టణంలోని వేణుగోపాలపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మలేరియా జ్వరం బారిన పడ్డారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులూ విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు సాధారణ జ్వరాలతో బాధపడుతున్నారు. జరజాపుపేట అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షల నిమిత్తం 200 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. పాఠశాల ప్రహరీ ముందున్న గొయ్యిలో పెద్ద ఎత్తున మురుగునీరు నిల్వ ఉండడం, దోమలు ఎక్కువగా పెరగడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. మలేరియా బారిన పడిన విద్యార్థులు కోలుకున్నారని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు.


కాలువల్లో చెత్త వేయరాదు..

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



జేసీబీ సహాయంతో కాలువలోని చెత్తాచెదారాలను తీస్తున్న దృశ్యం

విజయనగరం: కాలువలలో చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లో వేయరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య సిబ్బంది ఒకటో నంబర్ సచివాలయం పరిధి సాకేటివీధిలో ప్రధాన కాలువను జేసీబీ సహాయంతో శుక్రవారం శుభ్రం చేశారు. చెత్తా,చెదారాతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని కమిషనర్ నల్లనయ్య ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు అప్పగించి, స్వచ్ఛ విజయనగరానికి సహకరించాలని కోరారు.



మూతపడిన నెల్లిమర్ల జూట్ మిల్లు

జూట్ మిల్లు కార్మికుల..
ఆకలి కేకలు

- తొమ్మిది నెలలుగా లాకౌట్..
- ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన కార్మికులు
- చర్చల పేరుతో కాలక్షేపం చేస్తున్న యాజమాన్యం
- పట్టించుకోని ప్రభుత్వం..
- రోడ్డున పడిన రెండు వేల కార్మిక కుటుంబాలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్‌మిల్లు అకారణంగా మూతపడి తొమ్మిది నెలలైంది. ఈ సమయంలో దాదాపు పదిసార్లు చర్చల పేరుతో యాజమాన్యం కాలక్షేపం చేస్తోందే తప్ప మిల్లు తెరిచే ప్రయత్నం చేయడం లేదు. విషయాన్ని కార్మికులు స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో జూట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలిసిన పని చేయడానికి అందుబాటులో వేరే జూట్ మిల్లులు లేక.. వేరే పనులకు వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నారు. మిల్లులో పర్మినెంట్, ఇతర విభాగాల్లో కలిపి సుమారు రెండు వేల మంది పనిచేస్తున్నారు. అయితే తొమ్మిది నెలల కిందట ముడిసరుకు కొరత పేరిట యాజమాన్యం మిల్లుకు లాకౌట్ ప్రకటించింది. గతంలో కూడా పలుమార్లు లాకౌట్ ప్రకటించిన సందర్భాలున్నాయి. కొన్నేళ్లుగా యాజమాన్యం తాము చెప్పిందే వేదంగా మిల్లును నడుపుతూ ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం వహించినా సరే కార్మికులు ఓపికతో పని చేశారు. అయితే కావాలనే ముడిసరుకు కొరత పేరుతో యాజమాన్యం మిల్లును మూసేసిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. యాజమాన్య నిర్లక్ష్య ధోరణి వల్ల పని చేస్తున్న కార్మికులు, రిటైర్మెంట్ కార్మికులు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు పొందలేకపోతున్నారని వాపోతున్నారు. 2016 సంవత్సరం నుంచి గ్రాట్యుటీ బకాయిలు కూడా యాజమాన్యం కార్మికులకు చెల్లించలేదు. చెక్కులు ఇచ్చినప్పటికీ ఖాతాలో నగదు లేక పోవడం అవన్నీ బౌన్స్ అయ్యాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పెద్దలైనా మిల్లు తెరిచేలా చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాలయాపన తగదు..



మిల్లు యాజమాన్యానికి చర్చల పేరుతో కాలయాపన చేయడం తగదు. తొమ్మిది నెలల్లో పలుమార్లు కార్మిక శాఖాధికారులు యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. ఒకసారి యాజమాన్య ప్రతినిధులు చర్చలకు వస్తే.. మరోసారి రావడం లేదు.. ఇలా వారికి నచ్చినట్లు వ్యవహరిస్తుండడంతో గతేడాది నవంబర్ నుంచి ఈ నెల 10 వరకు సుమారు పది సార్లు చర్చలు వాయిదా పడ్డాయి. జూట్ యాజమాన్యం చర్చలకు హాజరుకాకుండా లేబర్ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తుందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నెల పదో తేదీన జరగనున్న చర్చలకైనా యాజమాన్యం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తప్పదు.

– కిల్లంపల్లి రామారావు, సీఐటీయూ నాయకుడు, నెల్లిమర్ల

ప్రతి శుక్రవారం డ్రై డే

విజయనగరం: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఫ్రై డే – డ్రై డే అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని పరిశుభ్రపరచుకోవాలన్నారు. మున్సిపల్ సిబ్బంది శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి డ్రై డే విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందడానికి నీటి నిల్వలే ప్రధాన కారణమన్నారు. అందువల్ల ఇంటి పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



నీటి నిల్వలను తొలగించి శుభ్రం చేస్తున్న సిబ్బంది

దుప్పాడ రోడ్డుకు మోక్షం



దుప్పాడకు వెళ్లే మార్గంలో వేసిన మెటల్

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రం నుంచి దుప్పాడ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా గతుకులమయం కావడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు అధికారులు రహదారి ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఇటీవల మెటల్ వేయగా.. మరికొద్ది రోజుల్లో తారురోడ్డు వేయనున్నారు. అయితే మెటల్ రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, త్వరగా రోడ్డు వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు

నెల్లిమర్ల : మధ్యాహ్న భోజనానంతరం అరగంట తర్వాత ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. వైద్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. 19 ఏళ్ల లోపున్న ప్రతి ఒక్కరితో మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

గిరిజన సమస్యలు పరిష్కరించండి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు చింతపల్లి గిరిజనుల వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావును కలిసిన గిరిజన గ్రామస్తులు

విజయనగరం అర్బన్: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన గిరిజన గ్రామాల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు, పాఠశాలల అధ్వాన పరిస్థితులు, తదితర అంశాలను డీవీజీ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఆయా గ్రామాల్లో పర్యటించలేనని.. కోడ్ ముగిశాక గ్రామాల్లో పర్యటించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో గిరిజన సంఘాల నాయకులు బొబ్బిలి లక్ష్మణ్, తదితరులున్నారు.

నేటి నుంచి ఖాదర్ బాబా ఉరుసు మహోత్సవాలు

- రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తజనం
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఖాదర్‌బాబా దర్గా నిర్వాహకులు



హజరత్ ఖాదర్ వలీ బాబా



బాబా పాదాలు

విజయనగరం టౌన్: భక్తి అనేది భజనల్లో లేదు.. శిరస్సు వంచినంత మాత్రాన వచ్చేది కాదు.. సాటి మనిషి ఆకలి తీర్చడం, వారి బాధల నుంచి విముక్తి కల్పిస్తే భగవంతుడు నీ దగ్గరకు వస్తాడని హజరత్ ఖాదరవలీ బాబా సర్వమానవాళికి ఓ అద్భుతమైన సందేశాన్ని అందించారు. పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్నిదానాల్లో కన్నా అన్నదానం గొప్పదని చెప్పి దాన్ని ఆచరించిన మహానుభావుడు.. అలాగే తనవద్దకు సమస్యలతో వచ్చే వారికి చిరునవ్వుతో గులాబీ రెక్కలను అందజేసి వారి సమస్యలను తీర్చే మనుషుల్లో దేవుడిగా హజరత్ ఖాదర్‌వలీ బాబా పేరు పొందారు. మానసిక, శారీరక రుగ్మతల నివారణ కోసం భక్తులు బాబాను ఆశ్రయిస్తారు. బాబా శిష్యులు వందేళ్లకు పైగా నిత్యాన్నదానం కొనసాగిస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. 19వ శతాబ్దంలో నవంబర్ 23న ఆబాద్‌మహల్ వద్ద సయ్యద్ మహ్మద్ ఆలీఖాన్, మహత్రమ్మ బీబీ దంపతులకు హజరత్ ఖాదర్‌వలీబాబా జన్మించారు. తండ్రి ఆజ్ఞ మేరకు నాగ్‌పూర్ వెళ్లి తాజుద్దీన్ బాబాను దర్శించి ఆయన నుంచి ఆధ్యాత్మిక శక్తిని, ఆధ్యాత్మిక సంపదను తీసుకున్నారు. 1920లో విజయనగరం వచ్చిన బాబా తన 20వ ఏట ఆధ్యాత్మికత మహనీయునిగా అవతరించారు.

మెట్టపైన....తపస్సులోకి..

అప్పట్లో ప్రస్తుతమున్న ప్రాంతమంతా మెట్ట ప్రాంతం. పశువుల కాపరులు తప్పితే ఎవరూ అటువైపుగా వెళ్లేవారు కాదు. కొండమీదకు యాదవులు ఒకసారి గొర్రెల మందతో వెళ్లారు. అక్కడ ఒక దగ్గర నుంచి శ్వాస వస్తున్న శబ్దాన్ని కనుగొన్నారు. ఓ పుట్టలోంచి శ్వాస వస్తున్నట్లుగా గుర్తించారు. లోపల ఉన్న బాబాను బయటకు తీసుకువచ్చి మేక పాలు అందించారు. మెట్టప్రాంతానికి తీసుకువచ్చి అనేక నెలలు బాబాకు సపర్యలు చేశారు. మెట్ట ప్రాంతానికి బాబాను తీసుకురావడం వల్ల ఆ ప్రాంతానికి బాబామెట్ట అని పేరు వచ్చిందని చెబుతుంటారు. ఖాదర్‌బాబా తన ధ్యానమందిరం (తపస్థలి)లో తపస్సు చేసుకునేవారు. ఆయన్ను దర్శించేందుకు రోగులు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చేవారు. ఎటువంటి రోగం ఉన్నా చిటికెలో నయం జరిగేది. దేశం నలుమూలాల నుంచి బాబాను దర్శించేందుకు తరలివచ్చేవారు. బాబా 1961లో భగవంతునిలో ఐక్యమయ్యారు.

మూడు రోజుల పాటు..

ఈ నెల 7, 8, 9 తేదీల్లో బాబామెట్టలో ఉరుసు మహోత్సవాలు నిర్వహణకు దర్బార్ దర్గా షరీఫ్ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా రానున్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుంది. అనంతరం జెండా మహోత్సవం, చాదర్ సమర్పణ.. రెండోరోజు ఆదివారం ఖురాన్ పఠనం, నషాన్, చాదర్, సందల్ షరీఫ్‌లతో ఫకీర్ మేళా ఖవ్వాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి భారీ ఊరేగింపు.. మూడోరోజు సోమవారం ఉదయం ఖురాన్ పఠనం, చాదర్ , దస్తార్ బందీ, భక్తులకు తబరుక్ ప్రసాదాల పంపిణీ, సలామ్ ఖుల్ షరీఫ్‌తో ఉరుసు మహోత్సవం సమాప్తమవుతుంది. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు బాబా ఆధ్యాత్మిక వారసుడు సజ్జద్ నషీన్ మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా ఖాదర్ దివ్యసందేశం ఉంటుంది. మూడురోజుల పాటు మహా దివ్య అన్నసమారాధన నిర్వహిస్తారు.

– ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్, ఉత్సవ నిర్వాహకుడు

• భూ ఆధార్ తప్పనిసరి



భూమి ఉన్న ప్రతి రైతూ తప్పనిసరిగా భూ ఆధార్ నంబర్ పొందాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో భూ ఆధార్ నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని 36 మంది రైతులకు భూ ఆధార్ నంబర్ ఇవ్వడం జరిగిందన్నారు. భూ ఆధార్ నమోదు కోసం రైతులు వన్‌బీ, రేషన్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్‌తో రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. భూ ఆధార్ నంబర్ ఉంటేనే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. – డెంకాడ

• పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



డెంకాడ మండల స్థాయి పంచాయతీ కార్యదర్శుల సంఘ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల విస్తరణాధికారి శ్రీనివాస్ అధ్యక్షతన మండల కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా బి.లక్ష్మణరావు, అధ్యక్షుడిగా టి.వెంకటరావు, ఉపాధ్యక్షులుగా ఆర్ఎస్ఎల్ తులసి, టి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శిగా బి.భవాని, కోశాధికారిగా జి.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్.వహీద, కె.రమేష్, జి.శంకరరావు, డి.భారతి, వై.రమణ, ఎస్.సాంబమూర్తిరాజు ఎన్నికయ్యారు. – డెంకాడ

• బోర్లకు మరమ్మతులు..



విజయనగరంలోని శ్రీనగర్ కాలనీ పరిధిలో తాగునీటి బోరుబావికి పురపాలక సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య ఆదేశాల మేరకు పాడైన బోర్లను వినియోగంలోకి తీసుకువస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

– విజయనగరం

• సత్కారం..



జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకం సాధించిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ఎస్.పల్లవితో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన కోచ్ చల్ల రామును శుక్రవారం స్థానిక కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన 38వ జాతీయ క్రీడలలో వెయిట్ లిఫ్టింగ్ 71 కిలోల విభాగం క్లీన్ అండ్ జర్క్‌లో 118 కిలోలు.. స్నాచ్‌లో 94 కిలోలు ఎత్తి పల్లవి బంగారు పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి తెలిపారు. సన్మానసభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

విద్యుత్ భారం తగ్గించేందుకే 'సూర్యఘర్'



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న బంగారమ్మ

నెల్లిమర్ల: గృహ వినియోగదారులకు విద్యుత్ భారం తగ్గించేందుకు కేంద్రం పీఎం సూర్యఘర్ పథకం అమలు చేస్తోందని వెలుగు ఏసీ బంగారమ్మ చెప్పారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బీఓఏలకు సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకంపై రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు రాయితీ ఉంటుందన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ వ్యయం రూ.70 వేలు కాగా.. ఇందులో రూ.30 వేలు కేంద్రం రాయితీగా ఇస్తోందన్నారు.

రెండు కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ వ్యయం రూ.1.40 లక్షలు కాగా రూ. 60 వేల రాయితీ.. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న రూఫ్‌టాప్ ఏర్పాటు వ్యయం రూ.1.95 లక్షలు కాగా రూ.78 వేల రాయితీ వస్తుందని చెప్పారు. లబ్ధిదారుడి వాటా 10 శాతం పోగా... మిగిలిన మొత్తాన్ని 7 శాతం వడ్డీపై బ్యాంకుల నుంచి రుణంగా అందిస్తారని తెలిపారు. సూర్యఘర్ యోజన పథకంపై గ్రిడ్ ఎడ్జ్‌వర్క్ లిమిటెడ్ అసిస్టెంట్ ఆపరేటింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు డ్వాక్రా మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మ, మేనేజర్ నాయుడు, సీసీలు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలో సతివాడ గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి. గణేష్ తెలిపారు. మద్యం విక్రయాలపై అందిన సమాచారం మేరకు దాడులు చేపట్టగా నిందితుడి వద్ద 12 మద్యం సీసాలు లభించాయన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.